

అంజన్నకే శఠగోపం

కొండగట్టు అంజన్న ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. - 8లో▸



కంటివెలుగు దేశానికి స్ఫూర్తి

సిరిసిల్లటౌన్: కంటివెలుగు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. 38వ వార్డులో చేపట్టిన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
36.0/18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం నుంచి ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నాలుగేళ్ల చిన్నారిపై కుక్కల దాడి



కుక్కలదాడిలో గాయపడ్డ చిన్నారి

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలకేంద్రంలో శుక్రవారం నాలుగేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ చిన్నారికి కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కోనరావుపేటకు చెందిన బొల్లె ఇసాక్–రూప దంపతుల కూతురు చరిష్మా(4) ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. కుక్కల దాడిలో తలపై తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు. చిన్నారి ప్రస్తుతం క్షేమంగా ఉంది.

వేతనాలు పెంచేలా కృషి చేయండి



సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): వేతనాలు పెంచి, రెగ్యులర్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ మాట్లాడుతూ ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులు అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, రెగ్యులర్ చేయాలని కోరారు. జల్లి లక్ష్మణ్, పోష రాములు, రాములు తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న యాదగిరి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు, కార్యకర్తలు పోరాడాలని బీజేపీ అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో శుక్రవారం ప్రజాగోస కార్నర్ సమావేశం జరిగింది. సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి యాదగిరి, నాయకులు శ్రీకాంత్, రవీందర్, రజిత, ప్రశాంత్, రవి, నరేశ్, రమేశ్, సాయి, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.


నేడు విధుల్లో చేరనున్న డీఈవో రమేశ్‌కుమార్



నూతన డీఈఓ రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: మెదక్ జిల్లా డీఈఓగా పనిచేస్తున్న ఎ.రమేశ్ కుమార్‌ను సిరిసిల్ల జిల్లా విద్యాధికారిగా బదిలీ అయ్యారు. ఆదర్శ పాఠశాలల అసిస్టెంట్ డైరెక్టర్ ఉన్న రమేశ్‌కుమార్ ఇప్పటి వరకు మెదక్ జిల్లా విద్యాధికారిగా పనిచేశారు. ఇప్పటి వరకు డీఈఓగా పని చేసిన రాధాకిషన్ మెదక్ జిల్లా విద్యాధికారిగా బదిలీ అయ్యారు. డీఈవోగా రమేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎమ్మెల్యేలూ..! రాజధానికి రావద్దమ్మా..!



- వారంలో ఆరురోజులు నియోజకవర్గాల్లోనే ఉండాలి
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు సీఎం ఆదేశాలు?
- ప్రజలకు అందుబాటులో ఉండాలని హితవు
- అకారణంగా రాజధానికి రావొద్దని స్పష్టీకరణ
- ముగ్గురు కేబినెట్ మంత్రులకు మినహాయింపు
- ఇప్పటికే పలు కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా.. తెలంగాణ ఉద్యమానికి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టుకొమ్మగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం. ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర నినాదం ఎత్తుకున్నప్పటి నుంచి నేటి వరకు జిల్లాపై ప్రత్యేకమైన అభిమానం ప్రదర్శిస్తున్నారు. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ 13 స్థానాలకు గాను, 12 చొప్పున అసెంబ్లీ స్థానాలు సాధించి బలాన్ని చాటుకుంది. ఇప్పుడు కూడా పూర్వపు తరహాలోనే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని పార్టీ స్పష్టమైన ఆదేశాలు పంపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మంత్రులు మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా వారంలో కనీసం ఆరురోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. మిగిలిన ఎమ్మెల్యేలు అత్యవసరమైతే తప్ప.. ఇకపై నుంచి చీటికి మాటికి రాజధానికి రావాల్సిన అవసరం లేదని, నియోజకవర్గపు సమస్యలపై దృష్టి సారించాలని స్పష్టంచేసినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన దరిమిలా.. ఈ మేరకు అందరు ఎమ్మెల్యేలకు సీఎం, పార్టీ అధిష్టానం నుంచి సందేశం అందినట్లు సమాచారం.

ఇప్పటికే మొదలు..

జిల్లాలో మంత్రి కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ పరంగా జిల్లాల్లో వరుస సమావేశాలతో బిజీగా ఉంటున్నారు. అటు కేబినెట్ ఇటు జిల్లా కలెక్టర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 13 సమావేశాల్లో హుజూరాబాద్, మంథని మినహా మిగిలిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు అధికార పార్టీ గెలిచింది. సీఎం ఆదేశాలతో దాదాపుగా ఎమ్మెల్యేలంతా స్పీడు పెంచారు.

- ➡ **జగిత్యాల:** డా.సంజయ్‌కుమార్ పల్లె నిద్రపేరుతో గ్రామాల్లో నిద్రిస్తున్నారు.
- ➡ **కోరుట్ల:** విద్యాసాగర్‌రావు లబ్ధిదారులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.
- ➡ **ధర్మపురి:** ఈశ్వర్ నిరంతరం జిల్లా సమీక్షలు, లబ్ధిదారులతో సమావేశాలు కొనసాగిస్తున్నారు.
- ➡ **సిరిసిల్ల:** కేటీఆర్ వేములవాడ మాస్టర్‌ప్లాన్ జిల్లాపై సమీక్షలు..
- ➡ **వేములవాడ:** రమేశ్ కొద్దికాలంగా పెరిగిన పర్యటనలు.
- ➡ **కరీంనగర్:** గంగుల కమలాకర్ తీగల వంతెన, ఎంఆర్‌ఎఫ్, స్మార్ట్‌సిటీ పనులపై సమీక్ష
- ➡ **చొప్పదండి:** రవిశంకర్ కొండగట్టు మాస్టర్‌ప్లాన్‌తో పెరిగిన స్పీడు..
- ➡ **మానకొండూరు:** బాలకిషన్ పల్లెల్లో మార్నింగ్ వాక్‌లకు ప్లాన్
- ➡ **పెద్దపల్లి:** మనోహర్‌రెడ్డి నిత్యం లబ్ధిదారులతో సమావేశాలు
- ➡ **రామగుండం:** చందర్ నిరంతరం సేవా, వసతుల కల్పనపై సమీక్షలు
- ➡ **హుస్నాబాద్:** సతీశ్‌బాబు స్థానిక సమస్యలపై ప్రజలతో సమావేశాలు.

ఎమ్మెల్యేలపై నిరంతర నిఘా..!

పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు సమాచారం. అందులో భాగంగా ఏ ఎమ్మెల్యే ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? స్థానికంగా ప్రజలకు ఎన్నిరోజులు అందుబాటులో ఉంటున్నారు? హైదరాబాద్‌లో ఎన్నిరోజులు ఉంటున్నారు? అన్న విషయాలపై నిరంతరం సమాచారం తెప్పించుకుంటున్నారు. వీటి ఆధారంగా వాటి పనితీరును ఆయన బేరీజు వేస్తున్నారని తెలిసింది. ఇటీవల సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్ కూడా ఉమ్మడి జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. గతవారం కొండగట్టు మాస్టర్ ప్లాన్ సందర్భంగా స్మితా సభర్వాల్ ఒకరోజు ముందే వచ్చారు. తాజాగా కరీంనగర్‌లో జరుగుతున్న తీగల వంతెన, ఎంఆర్‌ఎఫ్, స్మార్ట్‌సిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఆమె పరిశీలించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటలిజెన్స్, పార్టీ, ఇతర వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సీఎంవోకు రిపోర్టు అందుతూనే ఉంది. అందుకు అనుగుణంగా సీఎం నుంచి తగిన సూచనలు, సలహాలు వస్తూనే ఉన్నాయి.

అన్ని పార్టీలు వస్తున్న క్రమంలో..!

రాష్ట్రంలో పాత కరీంనగర్‌కు ఉన్న ప్రాధాన్యం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇక్కడ పాగా వేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, బీఎస్పీ, వైఎస్సార్ టీపీ తదితర పార్టీలన్నీ కొంతకాలంగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి. తాజాగా వీటికి తోడుగా ఎంఐఎం కూడా చేరడం గమనార్హం. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేసిన పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ.. పెండింగ్ పనులను పూర్తి చేయాలని సీఎం నుంచి సీనియర్ లీడర్ల ద్వారా ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ప్రత్యర్థి పార్టీల సంఖ్య, రాజకీయ పోటీ పెరుగుతున్న దరిమిలా.. నిరంతరం ఎమ్మెల్యేలంతా అప్రమత్తంగా ఉండాల్సిందేనని హెచ్చరించినట్లు సమాచారం.

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్‌ఇన్

సిరిసిల్లటౌన్/వేములవాడ: జిల్లాలోని పట్టణాల్లోని ప్రజలు మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణాల్లో నెలకొన్న సమస్యలు వీధికుక్కలు, కోతుల బెడద, వీధిదీపాలు పనిచేయకపోవడం, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలను ఆయా మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోరవచ్చు.

సిరిసిల్ల మున్సిపాలిటీ — నేడు



కమిషనర్ : సమ్మయ్య
సంప్రదించాల్సిన నంబర్ : 98499 05879
సమయం : ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

వేములవాడ మున్సిపాలిటీ



కమిషనర్ : అన్వేశ్
సంప్రదించాల్సిన నంబర్ : 70366 84716
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

కమిషనర్‌కు ఉద్యోగుల జాబితా

వేములవాడ: రాజన్న ఆలయంలో పనిచేస్తూ విజిలెన్స్ కేసులు, అవినీతి అక్రమాలు ఎదుర్కొంటున్న, క్రమశిక్షణారాహిత్యానికి గురైన 35 మంది ఆలయ ఉద్యోగుల జాబితాను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించినట్లు ఆలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈనెల 18న కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి వచ్చిన సీఎం కేసీఆర్‌కు ఆలయ ఉద్యోగులు బదిలీపై వెళ్లిన ఉద్యోగులు, రిటైర్మెంట్లతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారితోపాటు విజిలెన్స్ కేసులు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారు, క్రమశిక్షణారాహిత్యానికి గురైన వారి జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలంటూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వేములవాడ రాజన్న ఆలయం నుంచి నలుగురు ఏఈవోలు, 14 మంది పర్యవేక్షకులు, 17 మంది సీనియర్ అసిస్టెంట్ల జాబితాను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించినట్లు తెలిసింది. ఆమేరకు బదిలీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఆలయ ఉద్యోగుల ఆందోళన చెందుతున్నారు. చాలా కాలంగా ఇక్కడే పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు వివిధ కేసులు, సస్పెన్షన్లకు గురైన ఉద్యోగుల్లో మరింత ఆందోళన పెరిగింది.

'కరెంట్ సరఫరాలో సమస్యలుంటే తెలపండి'

సిరిసిల్లఅర్బన్: విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే తమకు తెలపాలని సెస్ ఎండీ రామకృష్ణ ప్రకటనలో కోరారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువద్దని తెలిపారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు 94408 14057, ఎండీ 94408 14058 నంబర్లలో సమాచారం అందించాలని కోరారు.

ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి
- అన్ని అంశాల్లోనూ ప్రగతి సాధించాలి
- జిల్లా అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: రాష్ట్రంలో ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో నెరవేర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కోరారు. హైదరాబాద్ నుంచి ఆమె శుక్రవారం సాయంత్రం మున్సిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు, కంటివెలుగు, జీవో 58, 76 ప్రకారం క్రమబద్ధీకరణలు, పోడుభూములకు పట్టాల పంపిణీ, ఆయిల్ పామ్ సాగుపై శాంతికుమార్ మాట్లాడారు. జిల్లాలోని అంశాలపై కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అమలుచేయాల్సిన అంశాలపై శాఖలవారీగా సమీక్షించారు. వేగంగా ప్రభుత్వ లక్ష్యాలను సాధించే దిశగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగాలన్నారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, డీటీవో బాలమణి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు పాల్గొన్నారు.

మా భూములు మాగ్గావాలె..

- భూములు ఇవ్వమన్న నామాపూర్ రైతులు



వినతిపత్రం ఇస్తున్న నామాపూర్ రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మల్లన్నసాగర్ కెనాల్‌కు అవసరమైన భూములను తమకు తెలియకుండానే సేకరించడం సరికాదని ముస్తాబాద్ మండలం నామాపూర్ రైతులు పేర్కొన్నారు. తహసీల్దార్ మునీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు ఆర్డీవో శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీకోడు నుంచి నామాపూర్‌కు వచ్చే మల్లన్నసాగర్ సబ్‌కెనాల్ ద్వారా ఇక్కడి రైతులకు ఉపయోగం లేదన్నారు. కెనాల్ కోసం నిర్వహించిన గ్రామసభల్లో ఇదే విషయం చెప్పామన్నారు. ఇప్పుడు తమ భూములకు చెక్కులు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అంగీకారం లేకుండా భూములు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. కెనాల్‌లో భూములు కోల్పోతున్న తమకు మరో ఆధారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం వద్దంటూ చెక్కులను తీసుకోలేదు. భూములకు బదులు మరోచోట ప్రభుత్వ భూములు కేటాయించాలని కోరారు. ఈవిషయంలో మంత్రి కేటీఆర్ తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతులు డాకూరి నాగరాజు, రాజేశం, చెర్ల మల్లేశం, గూడ రాజిరెడ్డి, వెల్మల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్‌డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్‌కు వినతి



రవీందర్‌సింగ్‌ను కలిసిన రేషన్‌డీలర్ల సంఘం నాయకులు

సిరిసిల్ల: రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్‌కు రాష్ట్ర రేషన్ డీలర్లు శుక్రవారం వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లోని ఆఫీస్‌లో రవీందర్‌సింగ్‌ను కలిసి ఈమేరకు రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు వినతిపత్రం అందించారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి రేషన్‌డీలర్ల సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రవీందర్‌సింగ్ తెలిపారు. త్వరలోనే సమావేశం నిర్వహిస్తామన్నారు. రేషన్‌డీలర్ల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మండ్లు, ఉపాధ్యక్షుడు సావనపల్లి రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతరాజు రమేశ్, వెంకటేశ్వర్లు, రేషన్‌డీలర్ల సంఘం నాయకులు ఆకునూరి బాలరాజు, వావిలాల ఆనందం, నర్సయ్య, రాజు, గాజుల శ్రీనివాస్, బందం మధు, తాటి వెంకన్న పాల్గొన్నారు.



రాజన్నా దీవించు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ తీవ్రంగా ఉండడంతో కాసేపు గర్భగుడి దర్శనాలు నిలిపివేశారు. అన్నపూజ టికెట్లను ఒంటిగంట తర్వాత అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు అభిషేకాలు, అన్నపూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

కొండచిలువల కలకలం



చెట్లపై ఉన్న కొండచిలువలు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం రెండు భారీ కొండచిలువ కలకలం సృష్టించాయి. మామిడిపల్లి శివారులోని చిన్నన్న -పెద్దన్న చెరువు వద్ద గల చెట్లపై రెండు కొండచిలువలు శుక్రవారం రైతులకు కనిపించాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా గొర్లు, మేకలు మేతకోసం వస్తుంటాయి. చెట్లపై కనిపించడంతో గొర్లకాపరులు ఆందోళన చెందారు. మేకల మందపై దాడి చేసేందుకే వచ్చినట్లు కాపరులు భావిస్తున్నారు. అటువైపు వెళ్లే కాపరులు, ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు.

బాల్యమిత్రుని భార్య వైద్యానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న పదోతరగతి మిత్రులు

చందుర్తి(వేములవాడ): క్యాన్సర్‌తో బాధపడుతున్న బాల్య మిత్రుని భార్య వైద్యానికి పదోతరగతికి చెందిన మిత్రులు ఆర్థిక సహాయాన్ని అందించి శుక్రవారం అండగా నిలిచారు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన మ్యాదరి లక్ష్మణ్ భార్య విజయ క్యాన్సర్‌తో బాధపడుతోందన్న విషయం తెలుసుకున్న పదోతరగతి వరకు కలిసి చదువుకున్న మిత్రులు తమ వంతు సహాయంగా రూ.20వేల నగదు అందజేశారు. 1989–90 విద్యా సంవత్సరంలో చందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న మోతె రాములు, ఈగ శ్రీనివాస్, బీరెల్లి రామారావు, తాటికొండ కృష్ణహరి కలిసి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

పెనంమడుగు షట్టర్లు అపహరణ

- పోలీసులకు ఫిర్యాదు



తూమును పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం శివారులోని పెనంమడుగు నుంచి ఆయకట్టు భూములకు వచ్చే సాగునీటి కాలువ తూము షెట్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం అటువైపు వెళ్లిన రైతులు గమనించి నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏఈ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సింగారం గ్రామంలోని ఆయకట్టు భూముల కు సాగునీరందించే కాలువ రెండు షట్టర్లను ఎత్తుకెళ్లడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నా రు. వెంటనే పోలీసులు దొంగలను పట్టుకొని, షెట్టర్లను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. పో లీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంజన్నకే శఠగోపం

- కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం
- ముసుగులు ధరించి వచ్చిన ముగ్గురు ముష్కరులు
- ఆలయ ఏళ్లచరిత్రలో తొలిసారి చోరీ సంఘటన కలకలం
- ఆలయ అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

కొండగట్టు(చొప్పదండి): ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన, ఏళ్లచరిత్రగల కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున చోరీ జరిదింది. చోరీ చిన్నదే అయినా.. ఆలయ చరిత్రలో తొలిసారి కావడం కలకలం రేపుతోంది. అధికార యంత్రాంగం దీనిని తీవ్రంగా పరిగణిస్తోంది. సీఎం కేసీఆర్ ఇటీవల ఆలయాన్ని సందర్శించి అభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. అయితే, కొద్దిరోజుల తేడాతోనే దొంగలు చోరీకి పాల్పడడం విస్మయం కలిగిస్తోంది.



ఆలయంలో విచారణ జరుపుతున్న పోలీసులు

దొంగతనం జరిగింది ఇలా..

శుక్రవారం వేకువజామున 1.10 గంటల ప్రాంతంలో ముసుగులు ధరించిన ముగ్గురు దొంగలు ఆలయంలోకి చొరబడ్డారు. 2.20గంటల వరకు తమ పనికానిచ్చేశారు. తొలుత ఆలయం వెనకాల ద్వారాల తాళాలు పగుల గొట్టారు. అనంతరం అంతరాలయంలోకి వెళ్లే దారికి అడ్డుగా ఉన్న తలుపుల పట్టీలు తొలగించి లోనికి ప్రవేశించారు. గర్భాయంలోని స్వామివారి కిరీటం, మకర తోరణం, శ్రీరామ రక్షగొడుగులు, మకర తోరణ స్తంభం, రెండు శఠగోపాలు, కవచం, అంతారాలయ తోరణాలు, ,శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయలోని మరోరెండు శఠగోపాలు, మరికొన్ని వస్తువులను అపహరించారు. ఆలయంలోని హనుమాన్ విగ్రహంపై గల శంఖుచక్రం, బంగారు శ్రీరామ రక్షతోకవారం, పదుకలు, ఉత్సవమూర్తి, అంతరాలయంలని తోరణం, శ్రీలక్ష్మీఅమ్మవారి ఆలయంలోని వెండి తోరణం, పాదుకలు, శ్రీ వెంకటేశ్వర ఆలయంలోని శ్రీరామ పట్టాభిషేకం వస్తువుల జోలికి వెళ్లలేదు. మొత్తంగా 15కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వీటి విలువ సుమారు రూ.9లక్షల విలువ ఉంటాయని ఈవో వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

ఆలయానికి పటిష్టమైన భద్రత లేదు. ఉన్న ఒక అధికారి కూడా రాత్రి సమయాల్లో అందుబాటులో ఉండడంలేదు. దీంతో సిబ్బంది తమకు ఇష్టమైనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భక్తులు నిత్యం గర్భాలయంలోకి రావడం, వారితోనే అధికారులు, అర్చకులు పనులు చేయించుకోవడం, అధికారులు, సిబ్బంది చేయాల్సిన విధులను సెక్యూరిటీ గార్డులు, ఇతర వ్యక్తులతో చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవో, ఆలయ సూపరింటెండెంట్ పర్యవేక్షణ లోపం ఇందుకు కారణమని అంటున్నారు. మొత్తంగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడం పెద్దలోపంగా కనిపిస్తోంది.

12మందితో సెక్యూరిటీ..

ఆలయంలో భద్రతా చర్యలు చేపట్టేందుకు 12 హోంగార్డులు ఉన్నారు. వీరు ఉదయం 6గంటల – 6 గంటల వరకు ఆరుగురి చొప్పున విధులు నిర్వర్తిస్తారు. రాత్రివేళలో నలుగురు హోంగార్డులు విధుల్లో ఉంటారు. రోజూ మాదిరిగానే రాత్రి వరకు ఓ హోంగార్డు విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత తన గదికి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో ముగ్గురు దొంగలు ఆలయంలోకి చొరబడినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయాన్నే ఆలయాన్ని శుభ్రపరచడానికి వెళ్లిన స్వీపర్లు.. గర్భాయంలో కోతులు ఉండటం, సామగ్రి చెల్లాచెదురుగా పడిఉండడాన్ని గమనించారు. వెంటనే ఆలయ ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆలయ ఈవో వెంకటేశ్‌కు సమాచారం అందించారు. ఆలయ ఈవో ఘటపై పోలీసులకు సమాచారం అందించారు.

రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్.

సమాచారం అందుకున్న పోలీసులు.. ఆలయానికి చేరుకున్నారు. భేతాళస్వామి ఆలయ పరిసరాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. నిత్యం స్వామి వారికి వినియోగించే సాగర్ గెస్టహౌస్ సమీపంలో హనుమాన్ కవచానికి సంబంధించిన ఓ ఫ్రేమ్‌ను వారికి దొరికింది. ఫింగర్ ప్రింట్ ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం, సైబర్ టీం ఆలయ పరిసరాల్లో అణువణువూ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. భక్తుల కోరికలు తీర్చే అంజన్న ఆలయంలోనో దొంగతనం జరగడం బాధాకరమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి చేస్తామన్న సమయంలో ఇలా దొంగతనం జరగడం విషాదకరమన్నారు.

10 బృందాలతో గాలింపు

డీఎస్పీ ప్రకాశ్ నేతృత్వంలో 10 పోలీసు బృందాలు దొంగల కోసం గాలిస్తున్నాయి. ఇందులో నలుగురు సీఐలు, 15 మంది ఏఎస్సైలు ఉన్నారు.

1008 నామాలతో పూజ

ఆలయంలో దొంగతనం జరగడం చాలా బాధాకరం. ప్రాయశ్చిత్తం కోసం హోమం, మూడు దేవతలకు 11లీటర్ల పాలతో అభిషేకం , 1008 నామాలతో పూజలు నిర్వహించాం. ఆ తర్వాతనే భక్తులకు అనుమతించాం.

– జితేంద్రప్రసాద్, అర్చకుడు, కొండగట్టు ఆలయం

దొంగలు ఉత్తరభారతీయులా?

- సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమైన కదలికలు
- సెక్యూరిటీ గార్డులు, భక్తుల్లా డ్రెస్సింగ్
- చోరీ అనంతరం మహారాష్ట్ర వైపు ప్రయాణం?
- పోలీసుల వద్ద కీలక సమాచారం

జగిత్యాలక్రైం/కొండగట్టు(చొప్పదండి): విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ దోపిడీలో పాల్గొన్న దొంగలు ఉత్తరభారతీయులు లేదా పొరుగు రాష్ట్రంవారు అయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైన వీడియోల ఆధారంగా.. పోలీసులు ఈ మేరకు నిర్ధరణకు వచ్చినట్లు సమాచారం. ఆలయం వెనక భాగాన ఉన్న భేతాళుడి గుడి నుంచి దొంగలు తలుపులు బద్దలు కొట్టినట్లు గుర్తించారు. చూసేవారికి అనుమానం రాకుండా సెక్యూరిటీ గార్డులను తలపించేలా డ్రెస్సింగు వేసుకుని, చేతిలో లాఠీలు పట్టుకున్నారు. సీసీ కెమెరాల్లో ముఖాలు కనబడకుండా తలలకు మంకీ క్యాపులు ధరించి, ఒంటిని పసుపురంగు శాలువాలతో కప్పుకున్నారు. తలుపులు బద్దలు కొట్టేందుకు వీలుగా ఉండే రెంచ్‌లు, ఇతర పనిముట్లను శాలువాల చాటును లోనికి తీసుకువచ్చారు. వీరి కదలికలు ఆహార్యం, ఆకారాలను బట్టి వీరు ఉత్తరభారతీయులుగా అనుమానిస్తున్నారు. వారంరోజులుగా జిల్లాలో వరుసగా జరుగుతున్న ఆలయాల చోరీలకు, వీటికి ఏదైనా లింకుందా లేదా? అన్న విషయాలను సైతం పోల్చిచూస్తున్నారు. రాత్రిపూట వెండి తాపడాలను పనిముట్లతో తొలచుకుపోయినా ఎలాంటి చడీచప్పుడు రాకుండా జాగ్రత్తపడ్డారంటే వీరంతా పక్కా ప్రొఫెషనల్ గ్యాంగ్ అన్న నిర్ధరణకు వచ్చారు. వీరికి సంబంధించిన కీలక సమాచారం కూడా పోలీసుల వద్ద ఉన్నట్లు సమాచారం. వీరు మహారాష్ట్రవైపు పారిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.



సీసీ ఫుటేజీల్లో రికార్డయిన దొంగల కదలికలు

పోలీసులపై చర్యలు..!

ఈ క్రమంలో ఆలయానికి రాత్రిపూట భద్రత కల్పించిన పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ మేరకు విధుల్లో అలసత్వం వహించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

దొంగలను గుర్తించిన పోలీసులు?

ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ దొంగలను పోలీసులు ఎట్టకేలకు గుర్తించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. సీసీపుటేజీల్లో రికార్డుల ప్రకారం దొంగలను పోలీసులు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టగా వారి ఉన్న ఆచూకి కూడా కనుగొన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వీరి అరెస్టును పోలీసులు ధ్రువీకరిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని అర్హులకు రేషన్‌కార్డులు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. చాలా మంది అర్హులు కొత్త రేషన్‌కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. 2017 నుంచి రేషన్ కార్డులు అందించకుండా సర్కారు తాత్సారం చేయడం దారుణమని పేర్కొన్నారు. పంతం రవి, సోము నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలు పట్టివేత



పట్టుబడ్డ వాహనం

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆర్ఐ శ్యామ్ తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న గండిలచ్చపేట, ముస్తాబాద్‌కు చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు పేర్కొన్నారు. ఇసుక వాహనం పట్టివేతఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామని ఎస్సై తెలిపారు. నారాయణపూర్‌కు చెందిన శివరాత్రి మహేశ్ అనే ట్రాక్టర్ యజమానితోపాటు డ్రైవర్ రాజన్నపేటకు చెందిన శివరాత్రి నర్సింలుపై కేసులు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాటలు కలిపి.. బంగారు చైన్ అపహరణ

- గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ ఉపేందర్

సిరిసిల్లక్రైం: తన స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిల్చున్న వృద్ధురాలితో మాటలు కలిపి తన బైక్‌పై ఊరిలో దిగపెడాతనని తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడి ఆమె మెడలోని రెండు తులాల బంగారు చైన్‌తోపాటు ఇంటిలోని నగదును ఎత్తుకెళ్లాడు ఓ ప్రబుద్ధుడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉపేందర్ వివరాలు వెల్లడించారు. సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణ తొమ్మిదేళ్లుగా దొంగతనాలు చేస్తూ చాలాసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

ఈనెల 23వ తేదీన నేరెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒంటరిగా ఉన్న తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌కు చెందిన ఏనుగు కమలమ్మను గమనించాడు. ఆమెతో మాటలు కలిపి.. వృద్ధురాలి కొడుకు తనకు పరిచయమని నమ్మించాడు. ఇంటి వద్ద దించుతానని తన బైక్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్లాడు. మాటల్లో పెట్టి పింఛన్ పెంచుతానని నమ్మించాడు. ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా కోసం వృద్ధురాలు ఇంట్లోకి వెళ్లగా.. వెనుకనే వచ్చిన కృష్ణ ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాక్కొన్నాడు. అంతేకాకుండా ఇంట్లో దాచి ఉంచిన రూ.10వేల నగదు తీసుకుని వెళ్తుండగా.. అడ్డుకునేందుకు ప్రయత్నించి కమలమ్మను నెట్టివేశాడు. అంతేకాకుండా ఎవరితోనైన చెబితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు తంగళ్లపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు దొంగతనాలకు పాల్పడుతున్న కృష్ణ వివరాలు సేకరించి శుక్రవారం బద్దెనపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకొని, రిమాండ్‌కు తరలించారు. దొంగలించిన బంగారు చైన్‌ను ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టగా.. దాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాజన్నకే శఠగోపం పెట్టిన ఘనుడు సీఎం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నకు ఏట రూ.100 కోట్లు ఇచ్చి అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి దేవుడికే శఠగోపం పెట్టిన ఘనుడు సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. వేములవాడ మండలం అగ్రహారం అంజన్నను శుక్రవారం దర్శించుకున్న తర్వాత విలేకరులతో మాట్లాడారు. మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం అందకపోవడం బాధాకరమన్నారు. మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తే ముంపు గ్రామాల్లోని నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేయడం రాచరిక పాలనకు నిదర్శనమన్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లోని మత్స్యసంపదపై కన్నేసిన మల్టీనేషనల్ కంపెనీలకు 300 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. పరిశ్రమలు పెట్టాలనుకుంటే మత్స్యసంపదను మత్స్య కార్మికుల నుంచి కొని, వారికి మంచి ధర ఇచ్చే పరిశ్రమలు రావాలని డిమాండ్ చేశారు. సోలార్ పవర్ కావాలంటే గుట్టల్లో, కాలువల గట్లమీద పెట్టుకోవాలని, ప్రాజెక్టులపై పెట్టొద్దన్నారు. సీఎం కేసీఆర్‌కు హామీలు ఇవ్వడమే తెలుసని, ఆచరణలోకి రావన్నారు. సీఎం ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ రాలేదు, వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు, నిరుద్యోగ భృతి ఇవ్వనే లేదన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీజేపీ మండలాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, బుర్ర శేఖర్‌గౌడ్, మోహన్‌రావు, జింక అనిల్, పబ్బ నాగరాజు, అన్నారం శ్రీనివాస్, ముప్పిడి శ్రీనివాస్ ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడిగా బుస్స శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎన్నంపల్లి గంగాధర్ వ్యవహరించారు. ఐదేళ్లపాటు బుస్స శ్రీనివాస్ అధ్యక్షుడిగా కొనసాగుతారని ప్రకటించారు. ఆమేరకు శుక్రవారం నిత్యాదానసత్రంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సమావేశమయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైె న బుస్స శ్రీనివాస్ దంపతులను సన్మానించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నా కృష్ణ, పట్టణాధ్యక్షుడు రేణికింది అశోక్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కట్కం జనార్దన్, చకినాల అశోక్, చేపూరి నాగరాజు, రమేశ్, కొండూరి సత్యనారాయణ, దైత కుమార్, వేణు, బుస్స బుచ్చిబాబు పాల్గొన్నారు.



బుస్స శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఎస్పీని కలిసిన కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు



ఎస్పీని సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శుక్రవారం కలిసి సన్మానించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ప్రతినిధులు ముస్కు మల్లారెడ్డి, బొడ్డు నారాయణ, బి.మదన్ పాల్గొన్నారు.

విధి నిర్వహణ సంతృప్తినిచ్చింది

- మూడేళ్లు ఉంటే చాలు అనుకున్నా..
- ఆరేళ్లు ఇక్కడే పనిచేశా
- సిరిసిల్ల సొంత ప్రాంతంగా మారింది
- బదిలీపై వెళ్తున్న డీఈఓ రాధాకిషన్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా పునర్ విభజనలో భాగంగా డీఈవోగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. సంతృప్తికరంగా ఉందని జిల్లా నుంచి మెదక్ డీఈఓగా బదిలీపై వెళ్తున్న డాక్టర్ రాధాకిషన్ పేర్కొన్నారు. జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్తున్న డీఈవోను శుక్రవారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఉద్యోగంలో బదిలీ సర్వసాధారణమన్నారు. ఎక్కువకాలం పనిచేయడంతో జిల్లాతో విడదీయరాని బంధం ఏర్పడిందని పేర్కొన్నారు. ఒక అధికారికి జిల్లాలో గరిష్టంగా మూడేళ్ల వరకే అవకాశం ఇవ్వాలన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు హక్కుల గురించి పోరాడుతూనే విద్య, సైన్స్ ఆవిష్కరణలు, వివిధ పోటీల నిర్వహణలో ముందుండడం అభినందనీయమని కొనియాడారు. వివిధ పాఠశాలలను మన ఊరు -మన బడిలో ఆధునికీకరించడం మరిచిపోలేనన్నారు. మంత్రి కేటీఆర్ జిల్లాకు ఒక వరమన్నారు. శనివారం మెదక్ డీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు. ఈక్రమంలో మెదక్ డీఈఓగా పనిచేస్తున్న రమేశ్‌కుమార్ సిరిసిల్ల డీఈఓగా శనివారం బాధ్యతలు తీసుకుంటారని వివరించారు.



బదిలీపై వెళ్తున్న డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖరీదైన వైద్యం అందక కూలీ మృతి

- చందాలతో అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన దినసరి కూలి బెస్త పద్మయ్య (50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులు తిరిగిన రోగం నయం కాలేదు. ఖరీదైన వైద్యం అందక ఇంటి వద్దనే ఉండగా.. పరిస్థితి విషమించి శుక్రవారం ప్రాణాలు వదిలాడు. పద్మయ్య భార్య పద్మ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. కూతురు స్వర్ణలత పెళ్లి చేశాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న పద్మయ్య ఏడాది క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎవరూ లేకపోవడంతో తిండి సరిగ్గా దొరక్క ఆరోగ్యం క్షీణించి మరణించాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో దహన సంస్కారాల నిర్వహణకు సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి రూ.5వేలు, మానుక కిషన్ రూ.2వేలు, మరికొందరు సాయం చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నట్టల నివారణమందు పంపిణీ

చందుర్తి(వేములవాడ): నట్టల నివారణ మందును మూగజీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్ కోరారు. చందుర్తి మండలం లింగంపేట, కట్టలింగంపేటల్లో శుక్రవారం నట్టల నివారణ మందును శుక్రవారం పంపిణీ చేశారు. 1635 గొర్రెలకు, 690 మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. పశువైద్యాధికారి నితిన్‌కుమార్, వైద్యసిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

వేములవాడరూరల్: వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ శివారులో కూల్‌డ్రింక్స్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తాపడింది. వేములవాడ నుంచి కొండగట్టుకు కూల్‌డ్రింక్స్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేవు.

ఓవరాల్ చాంపియన్‌గా కస్తూర్బా విద్యార్థినులు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రాధాకిషన్

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజస్థాన్‌లోని రోహత్ జిల్లా పాలి గ్రామంలో జరిగిన 18వ నేషనల్ జంబూరికి వెళ్లిన కేజీబీవీ విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించడంతో ఓవరల్ చాంపియన్‌గా నిలిపారు. విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శుక్రవారం అభినందించారు. వీర్నపల్లి, రుద్రంగి కేజీబీవీల నుంచి నలుగురి చొప్పున ఈ కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో భాగంగా ఫోక్‌డ్యాన్స్, మార్చ్‌ఫాస్ట్, కలర్ పార్టీ, ట్రెక్కింగ్ వంటి పోటీల్లో పాల్గొన్నారు. ఎస్ఎస్ఏ కో–ఆర్డినేటర్ పద్మజ, డిస్ట్రిక్ట్ గైడ్ ఆర్గనైజింగ్ కమిషనర్ నీలిమ, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్ సురేశ్, గైడ్ టీచర్ స్రవంతి, కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా

- పట్టించుకోని అటవీ అధికారులు

చందుర్తి(వేములవాడ): అటవీ ప్రాంతం నుంచి టేకు కలప అక్రమంగా రవాణా జోరుగా సాగుతోంది. చందుర్తి అటవీ ప్రాంతం నుంచి కలపను ట్రాక్టర్‌లో తరలిస్తున్న పట్టించుకునేవారు లేరు. చందుర్తి మండలం తిమ్మాపూర్ శివారు నుంచి శుక్రవారం టేకు దుంగలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది గ్రామంలో ఉన్నారనే సమాచారంతో ట్రాక్టర్‌ను దారిమళ్లించారని తెలిసింది. ఇలా నిత్యం టేకు కలప తరలిపోతోందని మండలంలోని అటవీ గ్రామాల వారు చర్చించుకుంటున్నారు. అటవీశాఖలో పనిచేస్తున్న సిబ్బందిని కొందరు స్మగ్లర్లు మచ్చిక చేసుకుని విలువైన టేకు కలపను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తిమ్మాపూర్‌లో టేకు కలపను పట్టుకున్నారన్న గ్రామస్తుల సమాచారంతో సంబంధిత బీట్ అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఎఫ్ఆర్ఓ ఖలీలొద్దీన్‌ను వివరణ కోరగా తమకు సమాచారం లేదన్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న టేకు కలప